

చెరువులను చెరబట్టారు!

బి.కొత్తకోట మండలంలో చెరువులను మట్టి మాఫియా చెరబట్టి చెలరేగిపోతోంది. కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. - 8లో



టీడీపీ నాయకుల దౌర్జన్యాలు అరికట్టండి

టీడీపీ నాయకుల దౌర్జన్యాలను అరికట్టాలని సీటీఎం గ్రామప్రజలు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు విన్నవించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 101 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

కుష్టువ్యాధి సర్వే ప్రారంభం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

సంబేపల్లె : ఇంటింటి కుష్టువ్యాధి సర్వేను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కొండయ్య సోమవారం మండల పరిధిలోని దేవపట్ల పీహెచ్‌సీలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధికి సంబంధించిన అనుమానిత రోగులను గుర్తించి పీహెచ్‌సీకి రెఫర్ చేస్తారని, ఒక వేళ స్క్రీనింగ్‌లో నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స ఉచితంగా ఇస్తారన్నారు. సోమవారం నుంచి రెండు వారాలపాటు ఆశాకార్యకర్తలు సర్వే చేసి వివరాలు నిర్దేశించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శైలజ మాట్లాడుతూ అంగవైకల్యం నివారించడానికి తొలిదశలోనే వ్యాధిని గుర్తించి త్వరగా చికిత్స ఇవ్వడమే సర్వే ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యూకలిస్ మెడికల్ అధికా రి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు చిరంజీవిరెడ్డి, రాధా మాధవి, పీఎంఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వస్తున్న ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

వైఎస్సార్ జిల్లా ఎస్పీగా ఈ.జి. అశోక్‌కుమార్



కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా నూతన ఎస్పీగా ఈ.జి. అశోక్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్ ఉత్తర్వులను జారీ చేశారు. సుమారు రెండున్నర నెలల తర్వాత జిల్లాకు కొత్త ఎస్పీ రానున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు బదిలీ తర్వాత అన్నమయ్య జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు ఇన్‌ఛార్జ్ ఎస్పీగా కొనసాగారు. కాగా, ఇటీవల అదనపు ఎస్పీ నుంచి ఎస్పీగా పదోన్నతి పొందిన కొందరిలో ఈ.జి అశోక్‌కుమార్ ఒకరు. ఈయన కడప డీఎస్పీగా గతంలో పనిచేసిన అనుభవం ఉంది.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ కర్త ఉదయశ్రీ కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు, ఇంగ్లీష్ మాధ్యమంలో చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్స్ నకళ్లను ఒక సెట్ జతపరిచి ఈనెల 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు కలెక్టరేట్ డి–బ్లాక్‌లో గల ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని పేర్కొన్నారు. అలాగే 23వ తేదీన కడప చిన్న చౌక్ గురుకుల పాఠశాలలో నిర్వహించే ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌తోపాటు డెమో ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రెండు నెలలపాటు భక్తులు సమర్పించిన కానుకలను ఇందులో లెక్కించారు. మఠం ఆవరణలో ప్రొద్దుటూరు, మైదుకూరు, పట్టనాలకు చెందిన దాదాపు 50మంది మహిళా భక్తులు డ్రస్ కోడుతో నగదు లెక్కించారు. రూ 23,30,585 నగదు, 200గ్రాముల బంగారం, 90 గ్రాముల వెండి వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి, పిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. రాజంపేట ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, పూర్వపు మఠాధిపతి కుమారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు కొండంత.. పరిష్కారం గోరంత!

- అనేక రకాల కారణాలతో అధికారులకు వినతులు
- ప్రతి వారం కలెక్టరేట్‌కు వచ్చి గోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు
- భూ సమస్యకు సంబంధించిన బాధితులే అధికం
- పదేపదే వస్తున్నా ఫలితం శూన్యం

సాక్షి రాయచోటి : సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కష్టాలతోపాటు సమస్యలు పెరిగిపోయాయి. వైఎస్సార్ సీపీ హయాంలో వరుసపెట్టి ప్రతినెలలోనూ సంక్షేమం అందుకుంటూ హాయిగా సాగిన ప్రజల జీవన ప్రమాణాలకు నేడు తిలోదకాలు పడ్డాయి. కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అందించకపోవడంతో అన్ని వర్గాలకు సంక్షేమం అందని ద్రాక్షగా మారింది. అయితే ఇదే తరుణంలో అధికార పార్టీ నాయకులకు ఇసుక, మద్యం షాపుల రూపంలో ఆదాయం ఒనగూరుతుండగా, ప్రజలకు సమస్యల తిప్పలు తిప్పడం లేదు. అధికార పార్టీకి సంబంధించిన చోటామోటా నేతలు ఎక్కడికక్కడ ఖాళీ స్థలాలపై కన్నేయడం...ఖాళీగా ఉన్నాయి కదా అని కబ్జా చేయడం, ఎవరికీ తెలియకుండా ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులకు తెర తీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ సమస్యలు కూడా తాండవిస్తున్నాయి. ఆ సమస్యలకు పరిష్కారం చూపాలంటూ జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌కు పరుగులు పెడుతున్నారు.

సమస్యల ఏకరువు

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. పెన్షన్ అందించాలని ఒకరు..రేషన్ కార్డు ఇవ్వాలని మరొకరు..ఇల్లు ఎప్పుడిస్తారంటూ మరొకరు వరుసపెట్టి వస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం కలెక్టరేట్ తలుపు తట్టడం కనిపిస్తోంది. తాగునీటి సమస్యతోపాటు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉపాధి కల్పించాలని పలువురు అధికారులను కలుస్తున్నారు. ప్రతి సోమవారం 350–400 మంది ప్రజలు వివిధ రకాల సమస్యలతో సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రెవెన్యూకు సంబంధించినవే అధికం..

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ సమస్యల పరంగా బాధితులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రధానంగా భూములకు సంబంధించి ఆన్‌లైన్, అండగల్, భూ వివాదాలు, ఆక్రమణలు, కబ్జాలపై ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రతి శనివారం కలెక్టర్, జేసీ, ఆర్డీఓ చాంబర్లలో భూములకు సంబంధించి కోర్టు నిర్వహిస్తున్నా...సోమవారం కూడా భూ సమస్యలపైనే బాధితులు వస్తున్నారు. తగాదాల వల్ల పెండింగ్‌లో ఉన్న బాధితులతోపాటు....ఇంటి పట్టాలు ఆక్రమణలు ఇలా ఎక్కువ సంఖ్యలో వచ్చి ఉన్నతాధికారులను కలుస్తున్నారు. ప్రతి సోమవారం వస్తున్న ఫిర్యాదుల్లో 50 శాతానికి పైగా భూ సమస్యలకు సంబంధించిన వారే ఉంటున్నారు. పదేపదే కార్యక్రమాలకు వస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఆశలు కాస్త అడియాశలు అవుతున్నాయి.

సమస్యలకు పరిష్కారం చూపాలి

ప్రజలు ఇచ్చిన అర్జీలోని అంశంపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అందిన సమస్యలను అశ్రద్ధ చేయరాదు. అత్యంత ప్రాధాన్యత, పారదర్శకతతో నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలి. అర్జీలు బియాండ్ ఎస్‌ఎల్‌ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కరించాలి. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి.

– చామకూరి శ్రీధర్, జిల్లా కలెక్టర్

ఎవరికి చెప్పినా ఫలితం లేదు



నాకు సంబంధించిన సర్వే 136–3లో 30 సెంట్లు, 36 సెంట్లు, 34 సెంట్లు భూమిని ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడు. పట్టా భూమి కాగితాలు ఉన్నా దౌర్జన్యంతో భూమిని ఆక్రమించి మామిడి చెట్లు వేసుకున్నాడు. ఈ విషయంగా అధికారులందరికీ ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు పోరాటం చేస్తున్నాను.

– మద్దిపట్ల రామకృష్ణయ్య నాయుడు. దిగువగొట్టివీడు, చిన్నమండెం మండలం

మార్కెట్‌లో వేలం పాట సమయం మార్చాలి



జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పాత మార్కెట్‌లో వేలం పాట సమయాన్ని మార్చాలని కోరాం. ఎందుకంటే పగలంతా కష్టపడి రాత్రికి రాయచోటికి రావడం, అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వేలం నిర్వహించడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతోంది. అలా కాకుండా తెల్లవారుజామున 5 గంటలకు వేలం పాట పెడితే నేరుగా రైతన్నలే వేలంలో పాల్గొంటారు. గతంలోనూ మార్కెటింగ్‌శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. సోమవారం జాయింట్ కలెక్టర్‌కు విన్నవించి సమస్యను పరిష్కరించాలని కోరాం.

– వి.రంగారెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి

దళితులకు భూమి, ఇళ్లు, శ్మశానానికి స్థలం కేటాయించాలి



మదనపల్లె మండలం పొన్నూటి పాలెం గ్రామం పనసమాకులపల్లెకు చెందిన దళితులు

అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం పొన్నూటి పాలెం గ్రామం పనసమాకులపల్లెకు చెందిన దళితులకు వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలు, శ్మశానానికి స్థలం కేటాయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మంచాల హరి కుమార్ ఆధ్వర్యంలో కొద్దిసేపు కలెక్టరేట్ ముఖ ద్వారం వద్ద నినాదాలు చేశారు. అనంతరం సుమారు 15 మందికి పైగా దళితులు కలెక్టర్‌ను కలిశారు. దళితులు పశువులను మేత కోసం బయటకు తోలుకు వెళ్లాలంటే అగ్రకులస్తుల భూమిలో వెళ్లాల్సి ఉన్నందున వారు వెళ్లనీయడం లేదని పేర్కొన్నారు. దళితులకు పొన్నుటి పాలెం గ్రామంలో సర్వేనెంబర్ 236 లో 170 ఎకరాలు, 271 సర్వే నంబర్ లో 7 ఎకరాల 50 సెంట్లు విస్తీర్ణము ప్రభుత్వ భూమి గయాలుగా కలగని ఈ గయాల భూమి నందు దళితులకు వ్యవసాయ భూమిని, ఇంటి స్థలాలను, శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు.

29 నుంచి దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. సోమవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 28న అంకురార్పణ జరుగుతుందన్నారు. జనవరి 29వ తేదీ ఉదయం 9.30 గంటలకు మీణ లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆయన వివరించారు. అలాగే ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజు హరికథలు, భక్తి సంగీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, ప్రశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ అధికారులు

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు

29వ తేది ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, 30న సూర్యప్రభ, పెద్దశేష వాహనం, 31న చిన్నశేష, సింహ వాహన సేవలు, ఫిబ్రవరి 1న కల్పవృక్ష, హనుమంత వాహన సేవలు, 2న ముత్యపుపందిరి, గరుడ వాహన సేవలు ఉంటాయి. 3న కల్యాణోత్సవం, గజవాహనం, 4న రథోత్సవం, 5న సర్వభూపాల, అశ్వవాహన సేవలు, 6న వసంతోత్సవం, చక్రస్నానం,7న పుష్పయాగం ఉంటుందని వివరించారు.

'కేతు' పతకానికి చెక్కు అందజేత

కడప ఎడ్యుకేషన్ : వైవీయూ తెలుగుశాఖలో ప్రతిభావంతులకు ఏటా కేతు విశ్వనాథరెడ్డి పేరిట స్మారక బంగారు పతకం, నగదు బహుమతి అందజేసేందుకు ఆయన కుమారుడు కేతు శశికాంత్ రూ.3.5 లక్షల చెక్కును యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ మేరకు ఆచార్య కృష్ణారెడ్డి సమక్షంలో విద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి కేతు శశికాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం చెక్కులను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రఖ్యాత విద్యావేత్త, ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకుడు ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి పేరిట అవార్డు నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. సాంస్కృతిక వారసత్వానికి బలమైన పునాది వేసిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడన్నారు. ఆచార్య రఘునాథ రెడ్డి కేతు సేవలను కొనియాడారు. దివంగత ప్రొఫెసర్ కేతు విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు కేతు పద్మావతమ్మ, కేతు శశికాంత్ , కేతు మాధవి, శిరీషలను వీసీ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎ.జి.దాము పాల్గొన్నారు.

మొక్కవోని సంకల్పం



పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పైనా, అటవీప్రాంతంలో ఎటుచూసిన వింతలు, విశేషాలు కనిపిస్తాయి. చూడాలన్న ఆసక్తి ఉంటే చూపరులకు బోలేడు వింతలు కనువిందు చేస్తాయి. అందులో ఒకటి గాలిబండ ఎదురుగా ఉన్న శిల. దీన్ని తేరిపారా చూస్తేకాని రాయిపై చెట్టు ఉందన్నది గుర్తించలేం. దారిన వెళ్తూ చూస్తే దీన్ని పసిగట్టలేం. దగ్గరగా చూస్తేనే అసలు వింత కళ్లకు కనిపిస్తుంది. రాయి అంటేనే కఠినానికి నిదర్శనంగా చెబుతుంటారు. అలాంటి ఈ కఠినశిలపై అడవిమల్లె చెట్టు విరబూసింది. ఎలా మొక్కైందో, ఎదిగేందుకు నీటిని ఎలా పొందుతుందో కళ్లకు మాత్రం కనిపించదు. శిల మధ్యలో మొలచి మొక్క చెట్టుగా ఎదిగింది. ఇప్పుడు చెట్టులో మల్లెలు విరబూస్తూ సుగంధాన్ని వెదజల్లుతోంది. బండరాయిపై చెట్టుగా ఎదిగి దర్శనమిస్తున్న ఈ అడవిమల్లె విశేషంగా చూడవచ్చు. దీని వయసు ఎంత అన్నది చెప్పలేంకాని చెట్టు మొదలుబట్టి చాలా ఏళ్లయినట్టు అర్థమవుతుంది. - బి.కొత్తకోట

సివిల్స్ విజేతలు..తీర్చేనా సమస్యలు!

- రాజంపేటకు దక్కిన బ్యూరోక్రాట్స్ పరిపాలన
- జిల్లా అటవీశాఖ కార్యాలయం ఏర్పాటు
- రెవెన్యూలో ఐఏఎస్ పాలన
- ఐపీఎస్ చేతుల్లోకి ఖాకీ పగ్గాలు



రాజంపేట : ఉభయ జిల్లాలో ప్రత్యేకస్థానం కలిగిన పార్లమెంట్ కేంద్రమైన రాజంపేటలో ఇక బ్యూరోక్రాట్స్ పరిపాలన కొనసాగనుంది. ఇక్కడ రాజ్యాంగం, చట్టం సక్రమంగా అమలుకానుందని, అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేస్తారని.. పేదలకు మేలు జరుగుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇక్కడ ఉన్న డివిజన్ ఫారెస్టు కార్యాలయం జిల్లా అటవీశాఖ కార్యాలయంగా రూపుదిద్దుకుంది. బ్రిటీషు కాలం నుంచి రాజంపేటలో ఐఏఎస్ పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దీంతో జిల్లా పాలనహోదాతో ఐఏఎస్,ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ కలిగిన అధికారులతో ఇక్కడ కొత్త పుంతలు తొక్కనుంది. ఆ దిశగా జిల్లా హోదా కొనసాగుతుందని ఆశలు పుట్టుకొచ్చాయి.

జిల్లా హెడ్‌క్వార్టర్‌లా ఫీలింగ్స్

ఒక రకంగా రాజంపేట వాసుల్లో జిల్లా హెడ్‌క్వార్టర్ అన్న ఫీలింగ్ కలుగుతోంది. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేట, రాయచోటి, మదనపల్లె సభల్లో తన దైనశైలిలో జనాన్ని నమ్మించేలా ఒక్కోచోట ఒక్కో రకంగా జిల్లా కేంద్రం చేస్తామని హామీలు గుప్పించారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌స్నిగల్ ఇచ్చింది. మరో 50నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయి. పూర్వపు జిల్లాకే రాజంపేట నియోజకవర్గం వెళ్లనుందని రాజకీయపరిశీలకులు భావిస్తున్నారు.

రెవెన్యూలో ఐఏఎస్ పాలన...

బ్రిటీషు కాలం నుంచి ఐఏఎస్‌పాలన ఉన్నప్పటికీ రాజంపేటకు అదే కొత్తేమి కాదు. ఇక్కడ ఐఏఎస్‌గా తొలిపోస్టింగ్ చేసిన వారు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హోదా వరకు వెళ్లారు.1915 నుంచి రాజంపేట సబ్ కలెక్టరేట్ ఉండేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కానీ అంతకముందు నుంచి బ్రిటీషు రెవెన్యూ పాలన కొనసాగింది. ఇప్పటికీ తెల్లదొరల రెవెన్యూ పాలనకు సబంధించి భవనాలు ఇక్కడ కనిపిస్తాయి.

రెవెన్యూ పాలన చేసిన ఐఏఎస్‌లు..

1953 నుంచి రాజంపేట డివిజన్ కేంద్రంగా కె.రామచంద్రన్, ఎంఆర్‌పాయ్, టీఎల్ శంకర్, డీ.ఆరోరా, ఎ.వల్లపన్, శ్రీరామచంద్రమూర్తి, ఎంఎస్‌రాజాజీ, సీఎస్ రంగాచారి,ఎస్,బాలకష్ణ, బాబురాం, అశోక్ కుమార్ గోయల్, జానకి కృష్ణమూర్తి, శర్మారావు సబ్‌కలెక్టర్లుగా ఉన్నారు. 1978 నుంచి మిన్నీమాథ్యూస్, ఎంహెచ్‌డీ సఫీక్యూజ్‌జామన్,రణదీప్‌సదన్, ఏసీ పునీత, అజయ్‌జైన్, ప్రీతీమీనా, కేతన్‌గార్గ్ తదితరులు సబ్‌కలెక్టర్లుగా పనిచేశారు. తాజాగా వైఖోమా నైదియాదేవి సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మూడున్నర దశాబ్దాల తర్వాత ఐపీఎస్ హోదా కలిగిన అధికారి చేతుల్లోకి ఖాకీపగ్గాలు వెళ్లాయి. ఉభయ జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలైన పులివెందుల, జమ్మలమడుగులో ఐపీఎస్ క్యాడర్ కలిగిన వారిని పోలీసు అధికారులుగా నియమించారు. అయితే ప్రశాంతతకు నిలయమైన రాజంపేటలో ఐపీఎస్‌హోదా కలిగిన అధికారిని నియమించడంతో త్వరలో రాజంపేటను జిల్లాకేంద్రంగా చేస్తారా అన్న ఆశలు జనంలో చిగురిస్తున్నాయి.

చేయాల్సినవి..

ఐఏఎస్ పరంగా.. రెవెన్యూ సబ్ డివిజన్ లో ప్రధానగా భూ వివాదాలు ఉన్నాయి. మండల రెవెన్యూ పాలన గాడిలో పెట్టాలి, పీజీఆర్‌ఎస్‌లో వచ్చే వినతులు పరిష్కారంలో కిండి స్థాయి అధికారుల్లో నిర్లక్ష్యం వీడేలా చేయాలి. రాజంపేట మండలంలో పట్టాదారు పుస్తకాలు త్వరగా ఇవ్వడం లేదు, భూ సమస్యలు పరిష్కారానికి ప్రతేక చర్యలు అవసరం.

- ఐపీఎస్ పరంగా మన్నూరు అప్‌గ్రేడ్ స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు భర్తీ చేయాలి, రాజంపేటటౌన్‌లో రెవెన్యూ, మున్సిపల్, పోలీసుశాఖ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ సమన్వయంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి. కళాశాలలకు నిలయమైన బోయినపల్లి ప్రాంతంలో పోలీసు అవుట్ పోలీస్ స్టేషన్‌ను తిరిగి అందుబాటులోకి తేవాలి. రాజంపేట పాత బస్టాండ్ లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించాలి, రాజంపేట టౌన్, బోయనపల్లిలో నైట్ బీట్ పెంచాలి, రోడ్ ప్రమాద నివారణ చర్యలు పటిష్టం చేయాలి, నిఘానేత్రాల వ్యవస్థను పటిష్టం చేయాలి. రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి, రాజంపేట ఏరియా హాస్పిటల్ లో ఔట్ పోస్ట్ నిరంతరం పని చేసేలా చేయాలి.
- ఐఎఫ్ఎస్ పరంగా నగర వనాలు అందుబాటులోకి తీసుకురావాలి, రాజంపేట రాయచోటి రోడ్డులోని రెడ్ వుడ్ జంగిల్ సఫారీని పునరుద్ధరించాలి. కడప– రేణిగుంట హైవే లోని రామాపురం చెక్ పోస్టులో సీసీ కెమెరాల వ్యవస్థను పునరుద్ధరించాలి, ఎర్రచందనం స్మగ్లింగ్ అడ్డుకట్టదిశగా చర్యలు చేపట్టాలి, సోమశిల బ్యాక్ వాటర్ లో ఎకో టూరిజంను తీసుకురావాలి.

ఆ ముగ్గురు...



మనోజ్‌రామ్ నాథ్‌హెగ్డే, ఐపీఎస్



వైఖోమా నైదియాదేవి



జగన్నాథసింగ్, ఐఎఫ్ఎస్

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమానైదియాదేవి, పోలీసుశాఖకు సంబంధించి ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, జిల్లా అటవీశాఖాధికారిగా జగన్నాథ్‌సింగ్‌లు నియమితులయ్యారు. ఈమూడు శాఖలు కూడా కీలకమైనవే. కూటమిపాలనలో ఎర్రచందనం స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతోంది. ఇందుకు ఇటీవల పట్టుబడిన సంఘటనలే నిదర్శనం. అలాగే రెవెన్యూపరంగా భూవివాదాలు ఆరునెలల్లో అధికమయ్యాయి. పోలీసుశాఖ తన విధులు మరిచి రాంగ్‌రూట్‌లో సేవలందిస్తోందన్న అపవాదును మూటకట్టుకుంది. ఈ నేపథ్యంలో ఈ మూడు శాఖలకు జిల్లా హోదా కలిగిన ఉన్నతాధికారులే పాలన సాగిస్తున్న తరుణంలో వీరు ఏమేరకు పనితీరు కనబరుస్తారన్నది వేచిచూడాలి.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంటిలో చోరీ

ములకలచెరువు : తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. స్థానిక మండల కేంద్రం వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న రహంతుల్లా తన కుటుంబంతో కలిసి వేడుకకు చౌడసముద్రం వెళ్లారు. వేడుక ముగించుకొని రాత్రి ఇంటికి రావడంతో ఇంటికి వేసిన తాళం పగలగొట్టి తలుపు తెరిచి ఉండడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరుగా తాళాలు పగలగొట్టి అందులోని రూ.60 వేల నగదు అపహరించుకొని వెళ్లినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చిల్డ్రన్ హోమ్‌కు బాధిత చిన్నారులు

నిమ్మనపల్లె : మండలంలోని వెంకోజిగారిపల్లె దాసరిపేటలో కీచకతండ్రి చేతిలో అత్యాచారానికి గురైన బాధిత చిన్నారులను మదనపల్లె చిల్డ్రన్‌హోమ్‌కు తరలించినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ..నిమ్మనపల్లె మండలం వెంకోజిగారిపల్లెకు చెందిన బోయకొండ తన ముగ్గురు పిల్లలపైన అత్యాచారానికి పాల్పడటంతో అతని భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పిల్లల బాగోగులు చూసేందుకు చిల్డ్రన్‌హోమ్‌లో చేర్చామన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. సత్యసాయిజిల్లా నల్లచెరువు కమ్మపల్లెకు చెందిన రైతు శివశంకర్‌రెడ్డి(70) కుటుంబ సభ్యులతో కలిసి కారులో అరుణాచలం బయలుదేరారు. మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డు వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నె వద్ద ప్రయాణిస్తున్న కారు రోడ్డుపక్కన ఆపి శివశంకర్‌రెడ్డి మూత్రవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెరువులను చెరబట్టారు!



బి.కొత్తకోట పెద్దచెరువులో తవ్విన మట్టి



కాండ్లమడుగు డంపింగ్‌యార్డు వద్ద చెరువులో మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న జేసీబీ

- జేసీబీలతో రాత్రి, పగలు ట్రాక్టర్లతో మట్టి తరలింపు
- రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలో చెరువులను మట్టి మాఫియా చెరబట్టి చెలరేగిపోతోంది. కఠినంగా వ్యవహరించాల్సిన రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. బయ్యప్పగారిపల్లె, బి.కొత్తకోట, బడికాయలపల్లె, కోటావూరు, తుమ్మనంగుట్ట గ్రామాల్లోని చెరువుల్లోంచి భారీ ఎత్తున మట్టి దోపిడీ సాగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా జేసీబీలతో మట్టి ట్రాక్టర్లలో నింపుకుని దర్జాగా తరలించుకుంటున్నారు. మట్టిని వాణిజ్య అవసరాలకు విక్రయిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మట్టి మాఫియా దందాను అరికట్టడంలో అధికారులు ఎవరూ చిత్తశుద్ధి చూపడం లేదు. కోట్లలో జరిగే వ్యాపార కార్యకలాపాల కోసం మట్టిని తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. కురబలకోట, మదనపల్లె ప్రాంతాలకు ఇక్కడినుంచే మట్టిని తరలించుకుని వెళ్తున్నారు. ప్రతి గ్రామానికి వీఆర్‌ఏ, వీఆర్‌ఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉంటారు. వీరు తమ కళ్లముందు జరుగుతున్న ఈ వ్యవహారంపై కనీసం స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీని ఫలితంగా చెరువులు ప్రమాదకరంగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పించడమే వన్‌స్టాప్ సెంటర్ ధ్యేయం

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు లయన్ రుఖియాబేగం



బాధిత మహిళ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం

రాయచోటి జగదాంబసెంటర్ : ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ, భద్రత కల్పించడమే వన్‌స్టాప్ సెంటర్ ధ్యేయమని అందుకు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండటం అభినందనీయమని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు లయన్ రుఖియా బేగం అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం ఎస్ఎన్ కాలనీలో ఉన్న ఒన్‌స్టాప్ సెంటర్(దిశ సెంటర్)ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడి ఓఎస్‌సీలో అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఓఎస్‌సీ సహాయం కోసం వచ్చిన బాధిత మహిళను పరామర్శించి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. గృహహింస చట్టం కింద తనకు తగిన న్యాయం జరిగేలా చూడాలని ఆమె కోరారు. అనంతరం వన్‌స్టాప్ సెంటర్‌లోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.వన్‌స్టాప్ సెంటర్‌కు భూకేటాయింపు చేసినట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి రమాదేవి, నోడల్ ఆఫీసర్ ప్రమీల, ఓఎస్‌సీ సీఏ ప్రభావతి, ఓఎస్‌సీ కౌన్సిలర్ ఫీమాఅంజూమ్, లాయర్ చంద్రకళ, కేస్ వర్కర్ సాదికున్నీసా, ఐటీ స్టాఫ్ భానుప్రియ, మల్టీపర్పస్ వర్కర్లు రెడ్డిప్రసన్న, శ్రావణి, సుజాత, సోఫి, నిరోషా, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బోధనాసుపత్రిని కాపాడుకుందాం

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిని ప్రైవేటుపరం కాకుండా ప్రజా ఉద్యమం ద్వారా కాపాడుకుందామని, పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేయొద్దని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి అన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిని ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనను కూటమి ప్రభుత్వం తక్షణమే మానుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రెడ్డి, తిరుమల, దేవా, నాగరాజా, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో మెరుగైన సేవలు అందించాలి

ఏఆర్ పోలీసు మొబిలైజేషన్ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి ఏఆర్ పోలీసులకు సూచించారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు సోమవారం సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాలపాటు నిర్వహించే మొబిలైజేషన్ కార్యక్రమాన్ని స్థానిక పోలీసు పెరేడ్ మైదానంలో అదనపు ఎస్పీ ప్రారంభించారు. పోలీసులు చేసే ప్రతి పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయస్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. ప్రజలు మనపై పెట్టుకున్న ఆశలు ఏమాత్రం సడలకుండా క్రమ శిక్షణతో మెలగాల్సి ఉంటుందన్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాలిచ్చే విధంగా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా తర్ఫీదునిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐలు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే



మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని ఏఎస్పీ మనోజ్‌రాంనాథ్ హెగ్డే హెచ్చరించారు. రాజంపేట ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించాక సోమవారం రైల్వేకోడూరుకు వచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి పోలీస్ క్వార్టర్స్, క్రైం రికార్డులను పరిశీలించారు. సీఐలు హేమసుందర్‌రావ్, వెంకటేశ్వర్లు, ఎస్ఐ నవీన్ బాబులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా, రౌడీయిజం, దౌర్జన్యాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే జైలుకు పంపాలని ఆదేశించారు. ప్రత్యేకంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు ఆక్రమణలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఉస్మాన్

పెద్దమండ్యం : ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మండలంలోని కలిచెర్లలో సోమవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కలిచెర్ల బండపై నివాసం ఉంటున్న ఎస్.ఖాదర్‌షరీఫ్ చేపల వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఉస్మాన్ (21) తండ్రికి తోడుగా ఉంటూ చేపల వ్యాపారం చేసేవాడు. అలాగే కర్ణాటకలోని పలు ప్రాంతాలలో ఖర్జూరం, బిస్కెట్ వ్యాపారానికి వెళ్లేవాడు. వ్యాపారానికి వెళ్లి ఆదివారం ఇంటికి వచ్చాడు. ఇతనికి మద్యం అలవాటు ఉంది. కలిచెర్ల వద్ద ఉన్న పెద్దబావి సమీపంలో చింతచెట్టు కింద మృతి చెంది ఉండడాన్ని సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన వారు గుర్తించారు. సంఘటన స్థలంలో మద్యం సీసాలు పడి ఉన్నాయి. అలాగే మృతుని పెదవి వద్ద రక్త గాయమైంది. మద్యం తాగేందుకు ఆదివారం రాత్రి అక్కడికి ఒక్కడే వెళ్లాడా, లేదా స్నేహితులు ఎవరితోనైనా వెళ్లాడా అనేది తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ పీవీ రమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు



రైతు సంఘం నేతలతో చర్చిస్తున్న మార్కెటింగ్, మున్సిపల్ అధికారులు

రాయచోటి అర్బన్ : ఆరుగాలం శ్రమించి సాగుచేసి, మార్కెట్‌కు తీసుకువచ్చిన కూరగాయలను వ్యాపారులు వేలం పాట పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, రాయచోటి అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ నాయుడు, బాలక్రిష్ణారెడ్డి ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను వారు కలిసి మాట్లాడుతూ రాయచోటి కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ఉత్పత్తులను వ్యాపారులు అర్ధరాత్రి సమయంలో వేలం వేస్తుండడం రైతులకు తీరని ఇబ్బంది కలిగిస్తోందన్నారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు వెంటనే స్పందించి ఉదయం 4 గంటలకు వేలం పాట నిర్వహించేలా చూడాలని కోరారు. దీనిపై జేసీ స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలని అక్కడే ఉన్న మార్కెటింగ్‌శాఖ ఏడీ, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాయచోటి ఏరియా నాయకులు మల్లికార్జున, రాజు, సుధాకర్, ఆంజనేయులు, లక్ష్మిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వంటగది తాళాలు ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ మాధవీలతకు వినతి పత్రం అందజేస్తున్న విద్యా కమిటీ చైర్మన్ హరిక్రిష్ణ

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి వంటగది తాళాలను ఇప్పించాలని సోమవారం తహసీల్దార్ మాధవీలతకు వినతి పత్రం అందజేశామని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ హరిక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి నెల 6వ తేదీ నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు వంట ఏజెన్సీగా విజయ కుమారిని ఎన్నుకున్నారన్నారు. అయితే పాత వంట ఏజెన్సీ వారు వంట గది తాళాలు వేసుకున్నారని, ఆ గది తాళాలను ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. దీంతో పాఠశాలలోని 360 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారం చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఆయన వెంట పుత్తా విజయ్ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యాలు అరికట్టండి

సబ్ కలెక్టర్‌కు సీటీఎం గ్రామస్తుల వినతి



టీడీపీ నాయకుల అక్రమాలపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీటీఎం గ్రామస్తులు, సర్పంచ్ తదితరులు

మదనపల్లె : టీడీపీ నాయకుల దౌర్జన్యాలను అరికట్టాలని చిన్న తిప్పసముద్రం(సీటీఎం) గ్రామప్రజలు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో సీటీఎం సర్పంచ్ ఆనంద పార్థసారధి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెలుగుచంద్రతో కలిసి, టీడీపీ నాయకుల అక్రమాలపై గ్రామస్తులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వివరించారు. గొల్లపల్లెమిట్టకు చెందిన టీడీపీ నాయకులు గౌర కృష్ణమూర్తి, గౌర రఘు, కుటుంబ సభ్యులు సీటీఎం గ్రామంలోని చెరువులు, కుంటలు, కాలువలు కబ్జాకు పాల్పడటమే కాకుండా హిందూ శ్మశానవాటికల్లోని ఖాళీ స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్నారు. ఈ విషయమై గ్రామంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. చెరువులు, కుంటల ఆక్రమణతో ఊరు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. రేగడగొల్లపల్లె సర్వే నంబర్.316/ఏలో 1 ఎకరా ప్రభుత్వ స్థలంతో పాటు శ్మశాన వాటికను ఆక్రమించారన్నారు. గ్రామానికి చెందిన బసప్ప కుమారుడు చలపతికి చెందిన సర్వే నంబర్.325/7, 325/8లోని 1.55 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారన్నారు. దొడ్డమ్మచెరువు సర్వే నంబర్.363/1లో రెండు ఎకరాలు వీరి కబ్జాలో ఉందన్నారు. వీరు 4 జేసీబీలు, 6 ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ స్థలాల్లో ఇసుక, మట్టి తరలిస్తున్నారన్నారు. వీరి ఆగడాలను స్థానికులు ప్రశ్నిస్తే, వారిపై దౌర్జన్యాలకు పాల్పడటం, బెదిరించడం చేస్తున్నారన్నారు. రెండురోజుల క్రితం గొల్లపల్లె మిట్టకాలనీలో జగనన్న కాలనీ కోసం గత ప్రభుత్వం సర్వే నంబర్.353/2, 352/4లో కొనుగోలు చేసిన 2.55 ఎకరాల భూమిలో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తే, అందులో ఎస్సీ, బీసీ కులాల లబ్ధిదారులకు చెందిన పునాదులను దౌర్జన్యంగా ఏపీ-03 సీడీ-6747 నెంబర్ జేసీబీతో కూల్చివేశారన్నారు. తమకు పట్టాతో పాటుగా హౌసింగ్ బిల్లులు మంజూరయ్యాయని చెబుతున్నా వినిపించుకోకుండా, తాము అధికారపార్టీకి చెందిన వారమని, దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరించారన్నారు. ఈ విషయమై పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం కేసు నమోదు చేయలేదని వాపోయారు.

ఆరోపణలపై ప్రమాణానికి సిద్ధం..

సీటీఎం హరిజనవాడ జగనన్న కాలనీలో పేదలకు చెందిన ఇళ్ల పునాదులను టీడీపీ నాయకులు జేసీబీతో తొలగిస్తే, బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితులకు అండగా నిలిస్తే...టీడీపీ నాయకులు తమపై అసత్య ఆరోపణలు చేస్తూ విషయాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారు ఆరోపిస్తున్నట్లుగా తాము అవినీతికి పాల్పడినట్లు ఆధారాలుంటే బహిరంగ విచారణకు తాము సిద్ధమని, కాణిపాకంలో ప్రమాణానికి టీడీపీ నాయకులు వచ్చి నిజాయితీ నిరూపించుకోవాలని స్థానిక సర్పంచ్ ఆనంద పార్థసారధి కోరారు.

దివ్యాంగుల కోసం దిగివచ్చిన సబ్‌కలెక్టర్

రాజంపేట సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి నిర్వహించారు. ప్రజలు నేరుగా వేదికపై ఉన్న సబ్‌కలెక్టర్ వద్దకు వెళ్లి తమ తమ సమస్యలపై వినతులను సమర్పిస్తున్నారు. దూరంగా కుర్చీల్లో నడవలేని దివ్యాంగులు కూర్చున్నారు. సబ్‌కలెక్టర్ నేరుగా వేదిక దిగివచ్చి దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించారు.

– రాజంపేట



దివ్యాంగుల సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య



నరసింహులు మృతదేహం

మదనపల్లె : భార్య కాపురానికి రాలేదని భవన నిర్మాణ కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాలెంకు చెందిన ఓబులేసు,చినపాప దంపతుల కుమారుడు జి.నరసింహులు(38) భవననిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య తులసమ్మ, కుమారులు నాగార్జున(15), బద్రి(13), కుమార్తె దీక్ష(11) ఉన్నారు. ఆరునెలల క్రితం భార్య తులసమ్మ కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి చీకలబైలు పంచాయతీ పుట్టినిల్లు అయిన కోళ్లవారిపల్లెకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి పలుమార్లు భార్యను కాపురానికి రావాల్సిందిగా నరసింహులు అత్తవారింటికి వెళ్లి కోరాడు. అయినా భార్య ససేమిరా అనడంతో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో సోమవారం గదిలోని ఫ్యాన్‌కు వైరుతో ఉరివేసుకున్నాడు. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు గమనించి సమాచారం అందించడంతో స్థానికులు నరసింహులును కిందకు దించి పరీక్షించారు. అప్పటికే మృతి చెంది ఉండటంతో తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి చినపాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

తాండాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

మదనపల్లె : మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీ కోటవారిపల్లె, ఉడుమువారిపల్లె తాండాల్లో నివసిస్తున్న ఎస్టీ సుగాలీలు 18 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామంటూ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కోటవారిపల్లె తాండా, ఉడుమువారిపల్లె తాండాకు చెందిన గ్రామస్తులు రోడ్డు సౌకర్యం కల్పించాల్సిందిగా వినతిచేశారు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ వచ్చేందుకు ఇబ్బందులేనని, ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమి కొంతమేర వదిలితే..రోడ్డు సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

పొలంలో బయటపడిన రాతి దేవతా విగ్రహాలు



వెలుగు చూసిన పురాతన రాతి దేవతా విగ్రహాలు



పూజలందుకుంటున్న విగ్రహాలు

తంబళ్లపల్లె : మండలంలోని కోటకొండలో ఓ రైతు పొలంలో పురాతన రాతి దేవతా విగ్రహాలు బయటపడ్డాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మద్దిరాళ్లపల్లె సమీపంలోని రంగారావు పొలాన్ని వెంకటేష్ కౌలుకు తీసుకున్నాడు. ఆదివారం సాయంత్రం ఆ పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నించాడు. సోమవారం ఉదయం ఆ పొలంలో వెంకటేష్ వెళుతుండగా మట్టితో కప్పబడిన రాళ్లు కనబడ్డాయి. మట్టి తొలగించి పరిశీలించగా అవి పురాతన రాతి విగ్రహాలుగా గుర్తించారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తెలుసుకుని రాతి విగ్రహాలను పరిశీలించి పూజలు చేశారు.

దళితులపై కేసు నమోదు

పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న దళితులు

రామసముద్రం : దళితులపై కేసులు నమోదు చేయడంపై సోమవారం రామసముద్రం పోలీస్ స్టేషన్ ముందు ఎగువపాళ్యం దళితులు బైఠాయించి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ రమేష్, స్థానిక పోలీసులు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు రామసముద్రం చేరుకున్నారు. దళిత నాయకులతో మాట్లాడుతూ.. చట్టానికి ఎవ్వరూ అతీతులు కారని, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అంతేకాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. మండలంలోని కురిజల, ఎగువ పాళ్యంకు సంబంధించి ఇరువర్గాల ఘర్షణలో ఎగువ పాళ్యంకు సంబంధించిన ముగ్గురిపైనే ఆదివారం కేసు నమోదు చేశారని దళితులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరగలేదని పిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. భౌతిక దాడులకు పాల్పడటం, పోలీసు స్టేషన్‌ను ముట్టడించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.